సాక్షి
సూర్యాపేట
శనివారం, 7, సెప్టెంబర్, 2024



నిజాయితీ చాటుకున్న..

బ్యాంకు ఎదుట దొరికిన నగదును బాధిత మహిళకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు కోదూరు వాసి. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 590 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,36,180 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,94,160 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,095క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,490 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,035 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం: 645 అడుగులు	
ప్రస్తుత నీటి మట్టం: 642.65 అడుగులు	
ఇన్‌ఫ్లో	: 5,670 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 5,670 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

గ్రానైట్ క్వారీలో అధికారుల విచారణ

కోదాడ రూరల్: మండల పరిధిలోని నల్లబండ గూడెం శివారులో ఉన్న గ్రానైట్ క్వారీలో మైనింగ్ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. క్వారీ నుంచి వచ్చే వ్యర్థాలతో పక్కన ఉన్న పంట పొలాలకు నష్టం జరుగుతుందని పలువురు రైతులు సీఎంఓ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో సీఎంఓ కార్యాలయ అధికారుల ఆదేశాల మేరకు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ నర్సింహారెడ్డి క్వారీకి వచ్చి విచారణ జరిపారు. చట్టూ ఉన్న రైతుల నుంచి వాంగ్మూలాన్ని సేకరించారు. విచారణకు వచ్చిన అధికారులు ఎలాంటి వివరాలు తెలపకుండానే వెళ్లిపోయారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మోతె: పిల్లలు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు అన్నారు. పోషణ అభియాన్ మాసోత్సవంలో భాగంగా శుక్రవారం మోతె మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పోషణ మేళాలను పరిశీలించారు. టీచర్లకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శ్రీవాణి, ఎంపీడీఓ ఆంజనేయులు, ఏసీడీపీఓ సాయిగీత, పీహెచ్ఎన్ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



సదస్సులో మాట్లాడుతున్న షేక్.మీరా

నడిగూడెం: ఆడపిల్లలంతా పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారి షేక్.మీరా అన్నారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలరక్ష భవన్స్ బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆడపిల్లల చదువు విషయంలో ప్రతిఒక్కరి ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. అనంతరం బాలరక్ష భవన్ జిల్లా అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, ఊర్మిళ, గంగాభవాని, దుర్గ, శైలజ, కనిష్, ఫాతిమా, బి.వంశీ, మల్లీశ్వరరావు పాల్గొన్నారు.

వాగు దాటితేనే .. దహన సంస్కారాలు

అర్వపల్లి: భారీ వర్షాలతో జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగుపై లోలెవల్ బ్రిడ్జి కావడంతో వరదకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం కోడూరు గ్రామానికి చెందిన మేకల రమణమ్మ అనే మహిళ మృతిచెందింది. ఆమె దహన సంస్కారాలు నిర్వహించడానికి మృతురాలి కుటుంబీకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాక్టర్‌లో శవంతో వాగు దాటి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.



వాగులో నుంచి ట్రాక్టర్‌లో శవంతో దహన సంస్కారాలకు వెళుతున్న గ్రామస్తులు

• గణేష్ నవరాత్రులకు సిద్ధం



గణనాథుడి విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్తున్న భక్తులు



సూర్యాపేటలో ఏర్పాటు చేసిన మండపం

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 89789 63674

వరద ముప్పు లేకున్నా..

కోదాడ మున్సిపల్ కార్యాలయంలోకి వర్షపునీరు

- తడిసిన ఫైళ్లు, విలువైన పత్రాలు
- డ్రెయినేజీని మూసేసి డబ్బాకొట్లు ఏర్పాటు చేయడమే కారణం
- ఆక్రమణలను తొలగించడంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



ఇటీవల కురిసిన వర్షానికి కోదాడ మున్సిపల్ కార్యాలయంలో తడిసిన ఫైళ్లు



మున్సిపల్ ఆఫీస్ వెనుక వైపు డ్రెయినేజీని ఆక్రమించి నెలకొల్పిన డబ్బాకొట్లు

కోదాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోదాడ మున్సిపల్ కార్యాలయం వర్షపునీటితో ముంపునకు గురైంది. ఇక్కడ ఎలాంటి వరద ముప్పు లేకపోయినా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో మునిగినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రజలకు సంబంధించిన విలువైన పత్రాలు, వందలాది ఫైళ్లు నీటిలో తడిసి ముద్దయ్యాయి. గతంలో కూడా ఇదే పరిస్థితి ఎదురైనా అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలా జరిగిందని పలువురు అంటున్నారు.

డ్రెయినేజీని పూర్తిగా మూసేయడం వల్లే..

వర్షపునీరు మున్సిపల్ కార్యాలయానికి ఉత్తరం వైపున ఉన్న డ్రెయినేజీ ద్వారా కిందకు వెళుతుంది. వంపు ఎక్కువగా ఉండడంతో గతంలో ఇక్కడ చుక్కనీరు కూడా నిలిచేది కాదు. కానీ, కొన్నేళ్లుగా మున్సిపల్ కార్యాలయం పరిధిలో ఉన్న వార్డుకు చెందిన ప్రజాప్రతినిధులు కార్యాలయం ఉత్తరం వైపునున్న డ్రెయినేజీని పూర్తిగా మూసేసి శాశ్వతంగా డబ్బాకొట్లను ఏర్పాటు చేశారు. వాటిని అద్దెలకు ఇస్తూ ప్రతినెలా వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షం వచ్చినా మున్సిపల్ కార్యాయంలోకి వచ్చిన వర్షపు నీరు బయటకు పోవడం లేదు. కార్యాలయంలో ఉన్న బావి వద్ద నుంచి డ్రెయినేజీలోకి వెళ్లే కాలువ ఎక్కువ ఎత్తులో నిర్మించడం.. అడ్డుగా ఉన్న కొన్ని డబ్బాకొట్లనైనా అధికారులు తొలగించపోవడంతోనే కార్యాలయం ముంపునకు గురైందని పట్టణవాసులు అంటున్నారు. వరద తగ్గిన తర్వాతైనా కార్యాలయం మునగడానికి కారణమైన డ్రెయినేజీ కాలువ సమస్యను పరిష్కరించడంలో మున్సిపల్ యంత్రాంగం కనీస చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలం..

మున్సిపల్ కార్యాలయంలోకి గతంలోనే నీరు వచ్చినా అప్పటి నుంచి జాగ్రత్తలు తీసుకోవడంలో యంత్రాంగం విఫలమైంది. దీంతో మరోసారి కార్యాలయం ముంపునకు గురైంది. అయితే మున్సిపల్ కార్యాలయం కొత్త భవనం పైఅంతస్తులో సమావేశ మందిరం ఉంటుంది. ఇక్కడ కేవలం మూడు, ఆరు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహిస్తారు. మిగతా సమయంలో అది ఖాళీగానే ఉంటుంది. నాలుగు ఇనుప బీరువాలను కొనుగోలు చేసి వాటిని సమావేశం మందిరం వెనుక వైపు ఉంచి విలువైన ఫైళ్లను అందులో భద్రపరుచుకోవచ్చు కానీ అధికారులకు మాత్రం ఆ పని చేయలేదు. దీంతో కార్యాలయం కింది భాగంలోనే ఉంచిన విలువైన ఎంబీ రికార్డులు, ఫైళ్లు తడిసి ముద్దయ్యాయి. ఇదిలా ఉంటే తాము చేసిన తప్పులు బయట పడకుండా వివిధ పత్రాలు తడిసేటట్లు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు సంబంధించిన ఫైళ్లు, ఎంబీ రికార్డులు తడిపోవడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి. కార్యాలయం చుట్టూ డ్రెయినేజీతోపాటు సగం రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై కనీస చర్యలు తీసుకోకపోవడం వల్లే వరదంతా ఆఫీస్‌లోకి చేరింది. ఆక్రమణలు తక్షణమే తొలగించి మున్సిపల్ కార్యాలయం మరోసారి మునగకుండా చూడాలి.

– కుదరవల్లి బసవయ్య, కోదాడ

ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజానీకం



జిట్టా అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

కేంద్ర మంత్రులకు స్వాగతం




హెలిపాడ్ దిగి వస్తున్న కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, బండి సంజయ్

మోతె: ఖమ్మంలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడారికి వచ్చిన కేంద్ర మంత్రులు శివరాజుసింగ్ చౌహాన్, బండి సంజయ్‌లకు శుక్రవారం మోతె మండలం సింగరేణిపల్లి టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు పాలేరు జలాశయం కింద ముంపునకు గురైన పంటలు పరిశీలించి వెళ్లిపోయారు. ముందుగా రాష్ట్ర మంత్రులకు కలెక్టర్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, తహసీల్దార్ సంఘమిత్ర, ఎంపీడీఓ ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ క్రస్ట్‌గేట్లు

- 20గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు



సాగర్ ప్రాజెక్టు 20 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్‌గేట్లు శుక్రవారం మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,04064 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు. 20రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,61,800 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 28,339 క్యూసెక్కుల నీటిని దిగువన గల కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా 13,925 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.10 అడుగులు ఉంది.

మూసీ ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. ఒక్కో గేటును మూడు అడుగుల మేర ఎత్తి 5,670 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపి వేశారు. 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ ప్రాజెక్టులో శుక్రవారం నీటి మట్టం 642.20 అడుగుల వద్ద ఉంది.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల



నాగార్జునసాగర్ : సాగర్ ఎడమకాల్వకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వారం క్రితం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం సమీపంలో ఎడమకాల్వ 133.06 కిలోమీటరు వద్ద గండి పడిన విషయం తెలిసిందే. దీంతో కాల్వకు నీటిని నిలిపివేశారు. గండి పూడ్చడానికి సమయం పడుతుండడంతో.. ఎడమకాల్వపై తడకమళ్ల వద్ద హెడ్‌రెగ్యులేటర్ గేట్లు మూసేసి అక్కడి వరకు ఉన్న ఆయకట్టుకు నీరిచ్చేలా అధికారులు సిద్ధమయ్యారు. ఆయకట్టుతో పాటు ఎత్తిపోతల పథకాల కింద ఉన్న 1,53,542 ఎకరాలకు నీరందనుంది.

పెసరకు 'మద్దతు' అంతంతే!

- తిరుమలగిరి మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు ప్రారంభం
- తొలి రోజే క్వింటాకు రూ.8,682 మద్దతు ధర
- ఆ తర్వాత నుంచి రూ.7వేల లోపే..
- సూర్యాపేటలో ఇష్టారీతిన కొంటున్న ప్రైవేట్ వ్యాపారులు



తిరుమలగిరి మార్కెట్ యార్డులో పెసళ్ల రాశులు

తిరుమలగిరి: జిల్లాలోని తిరుమలగిరి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్లలో పెసర కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సీజన్ ఆరంభంలోనే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లాలో తిరుమలగిరి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయించారు. దీంట్లో భాగంగా గతనెల 30న తిరుమలగిరి మార్కెట్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెసర కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తొలిరోజు మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగానే క్వింటాకు రూ.8,682 మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ప్రస్తుతం మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాకు రూ.7,040 వరకే కొంటున్నారు. ప్రారంభం రోజే మద్దతు అందించి మళ్లీ తక్కువ ధరకు కొనుగోలు చేయడంపట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సూర్యాపేట మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసర కొనుగోలు కేంద్రం ప్రారంభించనప్పటికీ ప్రైవేట్ వ్యాపారులు మాత్రం ఇష్టారీతిగా కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం మాత్రం మొదట ఒక కుప్పను మద్దతుకు మించి రూ.9,111 కొనుగోలు చేసి మిగతా వాటిని రూ.6,423 కొనుగోలు చేశారని రైతులు వాపోతున్నారు. సూర్యాపేటలో కూడా త్వరలోనే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

తొమ్మిదేళ్లుగా మద్దతు ధరలు (క్వింటాకు రూపాయల్లో)	
2015-16	4,650
2016-17	5,525
2017-18	5,575
2018-19	6,975
2020-21	7,196
2021-22	7,276
2022-23	7,755
2023-24	8,558
2024-25	8,682

కొనుగోళ్లు ఇలా..

సీజన్ ఆరంభం నుంచి తిరుమలగిరి మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 3,159 క్వింటాళ్లు, సూర్యాపేట మార్కెట్లో 3,262 క్వింటాళ్ల పెసర్ల కొనుగోళ్లు జరిగాయి. అయితే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.8,682 లభిస్తుందనే ఆశతో రైతులు మార్కెట్లకు పెసర్లను తీసుకొస్తున్నప్పటికీ మద్దతు ధర లభించని పరిస్థితి నెలకొంది.

2వేల ఎకరాల్లో పెసర సాగు

జిల్లాలో ఈ సారి 2వేల ఎకరాల్లో పెసర పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో ఎక్కువగా పెసర సాగైంది. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు యాదాద్రి భువనగిరి, జనగాం, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా రైతులు పెసళ్లను తీసుకొస్తారు. సూర్యాపేట మార్కెట్‌కూ పెసళ్ల రాక మొదలైంది.

ప్రతి బస్తాకూ క్యూఆర్ కోడ్

రైతు సమగ్ర సమాచార సర్వే ఆధారంగా ఇప్పుడు కొనుగోళ్లు చేపడుతున్నారు. రైతు పాసుపుస్తకం నంబర్, ఆధార్ నంబర్ క్లిక్ చేస్తే పంట వివరాలన్నీ పోర్టల్లో కనిపిస్తాయి. ముందుగా టోకెన్ ఇచ్చిన అనంతరం తక్‌పట్టీ కూడా ఇస్తారు. రైతు నుంచి ఎన్ని బస్తాలు కొన్నది. దాని విలువ ఎంతనే వివరాలను రైతులకు చేరవేస్తారు. ప్రతి బస్తాకూ క్యూఆర్ కోడ్ ఇస్తారు. కోడ్‌ను స్కాన్ చేస్తే రైతు సమగ్ర వివరాలు తెలుస్తాయి.

నాణ్యమైన పెసర్లు తెచ్చి మద్దతు ధర పొందండి

పెసర్లను ఎండబెట్టి, శుభ్రపరిచి నాణ్యమైన పెసర్లను మార్కెట్‌కు తీసుకురావాలి. ప్రధానంగా 12 శాతం లోపు తేమ ఉండేలా తీసుకొచ్చి క్వింటాకు రూ.8,682 మద్దతు ధర పొందాలి. రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, పెసర సాగు ధ్రువ పత్రం తేవాలి.

– జ్యోతి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్, సూర్యాపేట

క్లుప్తంగా

నిజాయితీ చాటుకున్న కోడూరు వాసి

అర్వపల్లి : బ్యాంక్ ఎదుట పోగొట్టుకున్న నగదును తిరిగి బాధిత మహిళకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు వాసి తండు కిరణ్‌కుమార్. మండలంలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కంపసాటి పద్మ జాజిరెడ్డిగూడెంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఉన్న క్రాప్‌లోన్ వడ్డీ పైసలు కట్టడానికి రూ.23వేల నగదు, పాస్‌ఫొటోలను కవర్‌లో తీసుకుని గురువారం వెళ్లింది. ఈ క్రమంలో ఆమె వెంట తెచ్చుకున్న కవర్ బ్యాంక్ ఎదుట పడిపోయింది. అయితే పద్మ కాసేపటికి కవర్ పడిపోయిన విషయాన్ని గుర్తించి వెతకగా దొరకలేదు. దీంతో ఆమె విలపిస్తూ ఇంటికి వెళ్లిపోయింది. అయితే అదే సమయంలో కిరణ్‌కుమార్ బ్యాంక్‌లో పనిముగించుకొని వెళ్తుండగా కవర్ కనిపించింది. ఆ కవర్‌ను తెరిచి చూడగా నగదుతో పాటు, పద్మ పాస్‌ఫొటోలు కనిపించాయి. వెంటనే ఆ కవర్‌ను తీసుకొని కోడూరు గ్రామంలోని ఎస్‌బీఐ మినీబ్యాంక్‌కు వెళ్లి సీఎస్‌పీ బిక్కి రమేష్‌కు చూపించి ఫొటో ఎవరనే విషయమై ఆరా తీయడంతో కాసర్లపహాడ్‌కు చెందిన పద్మగా గుర్తించారు. ఆమె వద్దకు వెళ్లి ఫొటోలు చూపించగా తమవేనని బ్యాంక్ వద్ద నగదు పోగొట్టుకున్నట్లు తెలిపింది. కిరణ్‌కుమార్ శుక్రవారం నగదును బ్యాంక్‌లో అప్పగించగా బ్యాంక్ మేనేజర్ బి.రామకృష్ణ పద్మను పిలిపించి అతడి సమక్షంలో రూ.23వేలు అప్పగించారు.

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటం

- వివేకానందుని స్ఫూర్తితో.. యువతను ఏకం చేసిన జిట్టా
- తెలంగాణ మలిదశ ఉద్యమంలో బాలకృష్ణారెడ్డిది ప్రత్యేక పాత్ర
- మూసీ ప్రక్షాళన కోసం పాదయాత్ర
- చివరకు ఉద్యమ పార్టీలోనే తుదిశ్వాస విడిచిన నేత


తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా భువనగిరి సభలో కేసీఆర్‌కు గొర్రెను బహూకరిస్తున్న జిట్టా (ఫైల్)


మూసీ ప్రక్షాళన పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి (ఫైల్)

సాక్షి,యాదాద్రి : తెలంగాణ అస్తిత్వం, తన ప్రాంత ప్రజల అభివృద్ధి, యువత బాగోగుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేశారు జిట్టా బాలకృష్ణారెడ్డి. హైదరాబాదులో 1992లో వివేకానంద యువజన సంఘం స్థాపించారు. రాష్ట్ర స్థాయిలో యువజన సంఘాల సమితిని ఏర్పాటు చేసి 10వేల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. 1992 నుంచి ఇప్పటి తుది శ్వాస విడిచే వరకు స్వామి వివేకానందుడి బాటలో పయనించారు. యువతను చైతన్య పరిచి.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు, గ్రామీణ క్రీడలు, శ్రమదానం, రక్తదానాలను ప్రోత్సహించారు. జిట్టా స్వయంగా 18 సార్లు రక్తదానం చేశారు. గుమ్మి విజయ్ కాంత్ రెడ్డి కన్వీనర్‌గా, మహేష్ ఆదిత్య కోకన్వీనర్‌గా ఉత్తర అమెరికాలో యువజన సంఘాల సమితి ఏర్పాటు చేసి దాని ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్య కోసం చేయూత

తన మేనమామ, ప్రవాస భారతీయుడు డాక్టర్ చిలుముల రాంచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లోనే రూ.1.20 కోట్ల వ్యయంతో భువనగిరిలో అమ్మమ్మ తాత పేర్లతో చిలుముల శివరాజిని నారాయణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. భువనగిరిలోని సీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద స్వామి వివేకానంద కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. తన తల్లి జిట్టా రాధమ్మ పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేశారు.

> **వ్యక్తిగత వివరాలు**
>
> పేరు : జిట్టా బాలకృష్ణారెడ్డి
> జననం: 14-12-1972
> తల్లిదండ్రులు : రాధమ్మ- బాల్ రెడ్డి (రిటైర్డ్ టీచర్)
> భార్య : సునీత
> సంతానం : వివేకానందరెడ్డి, ఝాన్సీ
> విద్యార్హతలు : బీకాం
> జన్మస్థలం : బొమ్మాయిపల్లి, భువనగిరి మున్సిపాలిటీ

మూసీ ప్రక్షాళనకు పాదయాత్ర

మూసీ నది ప్రక్షాళన కోసం 200 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు బాలకృష్ణారెడ్డి. 2005 ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు వలిగొండ నుంచి గ్రామాలు పర్యటిస్తూ హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. అదే హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. అప్పటి ప్రభుత్వం మూసీ జలాల శుద్ధికి రూ.350 కోట్లు విడుదల చేసింది.

మూడున్నర కోట్లతో వాటర్ ప్లాంట్లు

భువనగిరి నియోజకవర్గంలో ప్రజలు రక్షిత మంచినీటి కోసం రూ.మూడున్నర కోట్ల నిధులతో 106 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్లు జిట్టా బాలకృష్ణారెడ్డే ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేశారు. 2006వ సంవత్సరంలోనే భువనగిరి ప్రాంత ప్రజలకు కేవలం రెండు రూపాయలకే ఒక క్యాన్ నీటిని అందించారు. నేటికి ఇంకా కొన్ని చోట్ల జిట్టా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు నీరందిస్తున్నాయి. 2008లో భువనగిరిలోని కిసాన్‌నగర్‌లో రూ.6 లక్షల తన సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. 30 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజులు చెల్లించి ఆదుకున్నారు.

నిమ్స్ కోసం అలుపెరుగని పోరాటం

జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. బీబీనగర్ వద్ద నిమ్స్.. ఎయిమ్స్‌గా మారే వరకు వివిధ రూపాల్లో పోరాటం చేశారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి నిమ్స్‌ను 2009లో పూర్తి చేసి ప్రారంభించే వరకు రాజీలేని పోరాటం చేశారు. 2017లో తెలంగాణ సర్కారు ఈ ఆస్పత్రిని సినిమా షూటింగుల కోసం ఇచ్చే ప్రయత్నం చేస్తే దానిని అడ్డుకునే పోరాటం చేశారు జిట్టా. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేయడంతో మూడు రోజులు జైలుకు వెళ్లారు.

స్వచ్ఛమైన సాగునీటి కోసం పోరు

భువనగిరి నియోజకవర్గ రైతాంగానికి కృష్ణా జలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో నియోజకవర్గంలో 2008లో 350 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు. మూసీ కాలువలైన బునాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, బొల్లేపల్లి కాలువ కోసం ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

యువ తెలంగాణ జేఏసీ ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పనిచేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి యువ తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేశారు. తెలంగాణ రణభేరి, తెగదెంపుల సంగ్రామం పేరుతో తెలంగాణ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు, సదస్సులు ఢిల్లీలో తెలంగాణ జాతర నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని విస్తరింపజేశారు. సాగరహారం, మిలియన్ మార్చ్, రైల్ రోకో, రాస్తారోకో, వంటా- వార్పు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు.

యువ తెలంగాణ పార్టీ స్థాపన

యువ తెలంగాణ జేఏసీ నుంచి యువ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షునిగా జిట్టా బాలకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాణి రుద్రమ బాధ్యతలు తీసుకున్నారు. పాడి రైతులకు లీటరు పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం అందించేందుకు యువ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే వరకు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ విధానాలపై, గల్ఫ్ కార్మికుల సమస్యలపై, కళాకారుల సమస్యలపై, ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు 80శాతం రిజర్వేషన్ కోసం, బస్వాపురం భూ నిర్వాసితుల కోసం, అసైన్డ్ భూముల విషయంపై పోరాటం చేశారు. ఫార్మా కంపెనీల వల్ల చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ పరిసర ప్రాంతాలు విషతుల్యం అవుతుండడంతో వాటిపై నియంత్రణ కోసం పోరాటం చేశారు.

ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

2019 సెప్టెంబర్ 15న రాష్ట్రంలో టీఆర్‌ఎస్ రెండో సారి అధికారంలోకి వచ్చాక.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకపోగా, ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్న తరుణంలో.. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

బీజేపీలో విలీనం

ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం యువ తెలంగాణ పార్టీని 2022 ఫిబ్రవరిలో బీజేపీలో విలీనం చేశారు. 2022, జూన్2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ పరంగా నిర్వహించిన ఉద్యమ ఆకాంక్షల సాధన సభకు కన్వీనర్‌గా నియమితులై సభ నిర్వహించారు. అప్పుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో సహ ప్రముఖ్ గా నియమితులై చురుగ్గా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ విధానాలను ప్రశ్నించి బీజేపీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు 2023లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జిట్టా ఆ తర్వాత కొన్ని రోజులకే అక్టోబర్ 20న బీఆర్‌ఎస్‌లో చేరారు. సొంత ఇంటికి చేరుకున్నానని ప్రకటించారు. చివరిసారిగా జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా భువనగిరిలో సంక్రాంతి సంబురాలు, జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహించారు. పలువురు తెలంగాణఉద్యమకారులను సన్మానించారు.

చివరి వరకూ నెరవేరని కల

- ప్రజాప్రతినిధి కాకుండానే కన్నుమూసిన జిట్టా బాలకృష్ణారెడ్డి

వివిధ పార్టీల్లో చేరినా ప్రధాన పార్టీలేవీ జిట్టా బాలకృష్ణారెడ్డికి టికెట్ ఇవ్వలేదు. స్వతంత్ర అభ్యర్థిగా పలుమార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. 2004 నుంచి 2018 వరకు భువనగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసినా ఆయన గెలుపందుకోలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2003 డిసెంబర్ 28న జిట్టా బాలకృష్ణారెడ్డి టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. టీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2004లోనే భువనగిరి అసెంబ్లీ టికెట్ ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ సీనియర్ నేత ఆలె నరేంద్ర భువనగిరి నుంచి పోటీచేశారు. బాలకృష్ణారెడ్డి ఆ ఎన్నికల్లో నరేంద్రకు మద్దతు ఇచారు. 2009లో మహాకూటమి పొత్తుల్లో భాగంగా భువనగిరి సీటును సిట్టింగ్ స్థానాన్ని టీడీపీకి కేటాయించారు. దీంతో జిట్టా టీఆర్‌ఎస్ పార్టీని వదిలారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా.. 43,720 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల తర్వాత జిట్టా బాలకృష్ణారెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇస్తూ ప్రకటన ఇచ్చింది. కానీ ఆ వెంటనే కొద్ది రోజులకే డిసెంబర్ 23వ తేదీన తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకోవడంతో జిట్టా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. భువనగిరిలో 2014 ఎన్నికల్లో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేయగా 39,270 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ మద్దతులో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. మూడు సార్లు వరుస ఓటములు చవిచూశారు. ఆస్తులు అమ్ముకుని ఆర్థికంగా దెబ్బతిన్నా... గుండె ధైర్యం వీడకుండా తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు కొనసాగించారు. ప్రజల కోసం తన జీవితాన్ని, ఆస్తిపాస్తులను, రాజకీయాలను, భవిష్యత్తును త్యాగం చేసిన జిట్టాను ఆయన అభిమానులు కొనియాడుతున్నారు.

తెలంగాణ సంబురాలు నిర్వహించిన మొదటి నేత

- తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ఢిల్లీ దాకా పరిచయం చేసిన నాయకుడు

జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ మలి దశ ఉద్యమానికి తెలంగాణ సంస్కృతి, సంబురాలను జత చేసి కొత్త పుంతలు తొక్కించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక, శిల్పకళా వైభవాన్ని చాటి చెప్పేలా తెలంగాణ జాతరలు, సంబురాలను నిర్వహించి ఉద్యమానికి ఊపు తీసుకువచ్చారు. భువనగిరి ఖిల్లాను విద్యుత్ కాంతుల వెలుగులో ప్రపంచానికి తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను భువనగిరి నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు పరిచయం చేశారు. భువనగిరిలో 2007 ఫిబ్రవరిలో మొదటి సారిగా తెలంగాణ సంస్కృతి, వంటకాలు, పండగలపై 'తెలంగాణ జాతర' నిర్వహించారు. జాతర సభలో తెలంగాణలో మొదటిసారిగా కేసీఆర్‌కు గొర్రెపిల్ల, గొంగడి బహూకరించి గొల్ల కురుమల ప్రాముఖ్యతను చాటారు. 2007, మార్చిలో నిజాం కాలేజీ గ్రౌండ్స్, హైదరాబాద్ వేదికగా తెలంగాణ సంబురాలు నిర్వహించారు. 2010లో ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ గ్రౌండ్‌లో తెలంగాణ నుంచి గంగిరెద్దు, చేనేత మగ్గం, కుమ్మరి సారె, కమ్మరి కొలిమి, వడ్రంగి, చేతివృత్తుల పనిముట్లు, కోయ, డప్పు, డోలు, చిందు, యక్షగానం, బోనాలు, బతుకమ్మ వివిధ కళారూపాలతో పాటు కళాకారులతో ఉత్సవం చేశారు. తెలంగాణ వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, తెలంగాణ జాతర నిర్వహించారు. 2007 తెలంగాణ సంబురాలలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిచయం చేసి ఇప్పటికి బిఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో మొట్టమొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిట్టా సొంత ఖర్చుతో ఏర్పాటు చేయించారు.

ఉద్యమనేతకు అశ్రు నివాళి

భువనగిరి, భువనగిరి టౌన్ : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణరెడ్డి మృతి పట్ల ప్రముఖులు నివాళులర్పించారు. భువనగిరి పట్టణం సమీపంలోని ఫామ్‌హౌస్‌లో ఆయన పార్థీవదేహానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, జి.జగదీష్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మందుల సామేల్, శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కోదండరాం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్, గొంగిడి సునిత, డాక్టర్ నగేష్, కంచర్ల భూపాల్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమ నాయకుడు చెరుకు సుధాకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, , నాయకులు బాలరాజ్ యాదవ్, కోల్పుల అమరేందర్, మండడి ఉపేందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రుద్రమాదేవి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫామ్‌హౌస్ నుంచి అంతిమయాత్ర

జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమ యాత్ర తన ఫామ్‌హౌస్ నుంచి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో అంతిమయాత్ర టీచర్స్ కాలనీ మీదగా స్వగ్రామమైన బొమ్మాయిపల్లికి సాగింది. ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కళాకారులు పెద్ద ఎత్తున ఆటపాటలతో అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ అంత్యక్రియలు రాత్రి 8.30 గంటలకు ముగిశాయి. బాలకృష్ణారెడ్డి కుమారుడు వివేకానందరెడ్డి తలకొరివిపెట్టారు. ఆ సమయంలో బాలకృష్ణారెడ్డి భార్య సునిత, కుమార్తె ఝాన్సీ, తండ్రి బాల్‌రెడ్డి బోరున విలపించారు. అంతమయాత్ర సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జిట్టా పాడె మోశారు. బాలకృష్ణారెడ్డిని కడసారి చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జిట్టా పార్థీవదేహాన్ని కంటతడి పెట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో రావడంతో మూడు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.


జిట్టా సతీమణిని ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కన్నీరు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే

జిట్టా బాలకృష్ణారెడ్డితో తన స్నేహాన్ని గుర్తుచేసుకుని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి కన్నీరుపెట్టుకున్నారు. జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థీవదేహాన్ని చూసి బోరున విలపించారు. రెండు సార్లు ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడినప్పటికీ.. స్నేహం వేరు రాజకీయం వేరు అని అక్కడి ప్రజలు వ్యాఖ్యానించడం గమనార్హం.

పలువురి ప్రజాప్రతినిధుల మాటలు ఇవీ..

- అన్ని పార్టీలు జిట్టా బాలకృష్ణారెడ్డిని మోసం చేశాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. జిట్టా పేరు మీద ఏదైనా కార్యక్రమం నిర్వహించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఢిల్లీ వరకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేసిన వ్యక్తి జిట్టా అని అన్నారు. జిట్టా మృతిచెందితే కనీసం కేసీఆర్ రాకపోవడం బాధాకరమన్నారు. - ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జిట్టా అని అన్నారు. ఊరూరా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన ఘనత జిట్టాకు దక్కుతుందన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ సంబురాల పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో జిట్టా తెలంగాణకళలకు గుర్తింపు తీసుకు వచ్చారని చెప్పారు.
- ఎమ్మెల్యే మందు సామేల్ మాట్లాడుతూ.. 2003 నుంచి జిట్టా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన నాయకుడు అని, మచ్చలేని నాయకుడు అని అన్నారు.
- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జిట్టా బాలకృష్ణారెడ్డి అని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. నాయకుడిగా ఎదిగి చట్ట సభల్లో ఉండాల్సిన మంచి వ్యక్తి మృతిచెందడం బాధాకరమన్నారు.


జిట్టా మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి


జిట్టా మృతదేహం వద్ద మాజీ మంత్రులు హరీష్‌రావు, సబిత, మల్లారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్


రోదిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్, జిట్టా స్నేహితులు


జిట్టా మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంద కృష్ణమాదిగ


కన్నీటి పర్యంతమవుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


జిట్టా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత


జిట్టా బాలకృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


నివాళులర్పిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కుడుదుల నగేష్